


మూలగూడ చెక్‌పోస్టును పరిశీలించిన ఆర్వో

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలం మూలిగూడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కురుపాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు చూసి, పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. చెక్‌పోస్టు మీద నుంచి వెళ్తున్న ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎటువంటి అనుమతులు, రశీదులు లేకుండా వాహనాల్లో డబ్బులు, మద్యం తరలిస్తే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




- సీఎం హోదాలో హామీ ఇచ్చినా నెరవేర్చని వైనం
- ఐదేళ్లుగా గిరిజన రైతులను పట్టించుకోని వైసీపీ
- కానరాని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ సదుపాయం
- ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- తెగుళ్లు, దళారుల కారణంగా ప్రతి ఏటా నష్టాలు
- పంట సంరక్షణ చర్యలు శూన్యం



జగనన్నా.. జీడి పరిశ్రమ ఏదీ?

- సర్కారు తీరుపై మండిపడుతున్న ఏజెన్సీ వాసులు





(సీతంపేట/గుమ్మలక్ష్మీపురం)

'మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జీడి పరిశ్రమ ఏర్పాటు చేస్తాం' అని సాక్షాత్తు సీఎం జగన్ కురుపాం పర్యటన సమయంలో హామీ ఇచ్చారు. అయితే ఇది విని గిరిజన రైతులు ఎంతో సంతోషించారు. తమ కష్టాలు తీరుతాయని భావించారు. స్థానికంగానే గిట్టుబాటు ధరకు పంటను విక్రయించుకోవచ్చని అనుకున్నారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ సీఎం హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో వైసీపీ సర్కారు తీరుపై గిరిజన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో అత్యధిక శాతం గిరిజనులకు జీడి పంటే జీవనాధారం. సుమారు 40 వేల ఎకరాల్లో ఈ తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా పాచిపెంట, సాలూరు రూరల్, మక్కువ, కొమరాడ, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల్లో గిరిజనులు జీడి సాగు చేపడుతున్నారు. అయితే ఏజెన్సీలో కీలకమైన జీడి సాగు, గిరిజన రైతులపై ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. కనీసం పంట కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించలేదు. నష్టపరిహారం కూడా చెల్లించలేదు. తెగుళ్లు ఆశించిన సమయంలోనూ పట్టించుకోకపోగా.. ప్రోత్సాహకాలు కూడా అందించడం లేదు. దీంతో ఏటా ఆదివాసీలు గట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో దగా పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. జీడి రైతులకు అవసరమైన యంత్రాలు, పంట నష్టపోయిన వారికి ప్రోత్సాహకాలు అందించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఐదేళ్లుగా జీడి రైతులకు ఎటువంటి భరోసా కల్పించలేదు.

డిమాండ్ ఉన్నా..

మన్యంలో సాగయ్యే జీడి పంటకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. అంతేగాకుండా ఇక్కడి జీడి ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. దిగుబడి కూడా అధికంగా ఉంటుంది. మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ కిలో జీడి పిక్కలకు రూ.ఐదు వ్యత్యాసం ఉండడం వల్ల జీడి ఫ్యాక్టరీ యజమానులు, వ్యాపారులు ఈ ప్రాంతంలో పెద్దఎత్తున జీడి కొనుగోలుకు మొగ్గుచూపుతారు. అయితే ప్రభుత్వపరంగా ఎటువంటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఏటా గిట్టుబాటు ధర కూడా కల్పించడం లేదు. జీడిపిక్కల కొనుగోలుపై ఏఎంసీ, జీసీసీ, వన్‌ధన్ కేంద్రాలు దృష్టిపెట్టకపోవడం వల్ల వ్యాపారులు, దళారులు నిర్ణయించిన ధరకే గిరిజన రైతులు పంటను విక్రయించాల్సి వస్తోంది. దీంతో వారు తీవ్రంగా నష్టపో తున్నారు.



ఏజెన్సీలో సాగవుతున్న జీడి పంట



తోటల్లో సేకరించిన జీడిపిక్కలు

తెగుళ్ల బెడద.. తగ్గిన దిగుబడి

గత ఐదేళ్లు చూసుకుంటే.. ఏజెన్సీ ప్రాంతాల్లో జీడిపంట ఆశాజనకంగా లేదు. దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల కిందట నాటిన జీడి మొక్కలు.. ఇప్పుడు ముదిరిపోయాయి. దీంతో ఏటా దిగుబడులు తగ్గిపోవడంతో పాటు జీడి చెట్లకు అగ్గిదోమపోటు వంటి తెగుళ్లు ఆశిస్తున్నాయి. గతంలో 15 సంవత్సరాలు పైబడిన జీడి చెట్లకు కొమ్మ కత్తిరింపు విధానం ద్వారా ఐటడీఏ రైతులను ప్రోత్సహించేది. వాటికి అవసరమైన ఎరువులు, యంత్రాలను జాతీయ, ఐటీడీఏ ఉద్యాన శాఖాధికారులు సమకూర్చేవారు. అయితే గడిచిన ఐదేళ్లలో ఆ పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వం అటువంటి చర్యలేవీ చేపట్టకపోగా.. జీడి రైతులకు ఎటువంటి ప్రోత్సాహకాలు అందజేయలేదు.

- 2020-21లో జీడి పంటలకు పెద్ద ఎత్తున అగ్గితెగులు, దోమపోటు తెగుళ్లు ఆశించాయి. దీంతో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. అప్పట్లో రాష్ట్రస్థాయి ఉద్యాన శాఖ అధికారులతో సర్వే జరిపారు. జీడి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే నేటికీ నెరవేరలేదు.

ఏటా జీడి పంట దిగుబడి తగ్గి గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నా వారికి ఎటువంటి ఆర్థిక సాయం గాని, భరోసా గాని కల్పించడం లేదు. దీంతో సర్కారు తీరుపై గిరిజన రైతులు మండిపడుతున్నారు. దీనిపై గిరిజన సంఘాలు ఆందోళనలు చేపట్టినా.. వైసీపీ సర్కారు స్పందించలేదు. ఈ విషయంపై సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన శాఖాధికారిని వివరణ కోరగా ప్రభుత్వపరంగా జీడి రైతులకు ఎటువంటి పరికరాలు, ఎరువులు అందజేయలేదన్నారు. వాటి కోసం ప్రతిపాదనలు పంపించామని ఆయన స్పష్టం చేశారు.

నిధులు కేటాయించట్లే..

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐటీడీఏల పరిధిలో ప్రాజెక్టు ఉద్యాన శాఖలకు ఎటువంటి నిధులు కేటాయించడం లేదు. దీంతో ఆయా శాఖల అధికారులకు గిరిజన రైతులకు అవసరమైన యంత్రాలు, సేంద్రియ ఎరువులు, తెగుళ్ల నివారణ మందులు తదితర వాటని అందించలేకపోతున్నారు.

ప్రాసెసింగ్ యూనిట్లపైనా నిర్లక్ష్యం..

గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో గుమ్మలక్ష్మీపురం మండలం జేకేపాడు, ఇరిడి గ్రామాల్లో మినీ జీడి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ యూనిట్లు కూడా మూతపడ్డాయి. మరోవైపు చీడపీడల నుంచి పంట సంరక్షణ చర్యలు కూడా తీసుకోవడం లేదు. దీనిపై స్పందించాలని రైతులు, గిరిజన సంఘాల నేతలు పలుమార్లు కోరినా.. వైసీపీ సర్కారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

కార్యరూపం దాల్చలేదు..

జీడి పరిశ్రమ ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ ప్రకటించినా.. నేటి వరకు కార్యరూపం దాల్చలేదు. ముఖ్యమంత్రి హామీలు నీటిమూటలుగా మిగిలిపోయాయి.

-కోలక అవినాష్, గిరిజన సంఘం నాయకుడు, గుమ్మలక్ష్మీపురం



నష్టపరిహారం చెల్లించ లేదు..

2020-21లో అగ్గితెగులు, పొగమంచు వల్ల జీడిరైతులు భారీగా పంటను నష్టపోయారు. అయితే ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదు. దీనిపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది.

-బిడ్డిక అప్పారావు, గిరిజన సంఘం నాయకుడు, చిన్నకంబ, సీతంపేట మండలం



సర్వేలతోనే సరిపెట్టారు..

ఉద్యాన శాఖాధికారుల సర్వేలతోనే సరిపెట్టారు తప్ప నష్టపోయిన గిరిజన జీడి రైతులకు ఏమీ అందించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

-ప్రసాద్, జీడి రైతు, కిల్లాడగూడ, సీతంపేట మండలం



ప్రోత్సాహకాలు అందలేదు..

జీడి రైతులకు ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహకాలు అందించలేదు. దీనివల్ల ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నాం.

-రామారావు, రైతు, బెనరాయి, సీతంపేట మండలం

'సిద్ధం' సభకు బస్సులు

- తరలించేందుకు సిద్ధమవుతున్న ఆర్టీసీ
- ఆదేశాలు రాలేదంటున్న అధికారులు

పార్వతీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్ అనకాపల్లిలో నిర్వహించనున్న సిద్ధం సభకు జిల్లా నుంచి సుమారు 130 బస్సులు తరలించే ఏర్పాట్లలో అధికారులు ఉన్నట్టు సమాచారం. ఇదే జరిగితే.. పార్వతీపురం, సాలూరు, పాలకొండ వాసులతో పాటు 15 మండలాల్లో ప్రజలు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. అయితే ఆర్టీసీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రయాణికుల ఇక్కట్లు పట్టించుకోరా? అంటూ జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసీపీ ఎక్కడ సిద్ధం సభలు నిర్వహించినా జిల్లా నుంచి బస్సులు కేటాయించడంపై వారు మండిపడుతున్నారు. ఎప్పటికప్పుడు బస్సులను తరలిస్తుండడంతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. కాగా ఇది శుభకార్యాల సీజన్. జిల్లాలో భారీగా పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు తదితర ఫంక్షన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఈ సమయంలో అధికంగా బస్సులు కేటాయించాల్సింది పోయి.. సిద్ధం సభకు మళ్లించాలనుకోవడంపై జిల్లావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ప్రజా రవాణా అధికారి మాట్లాడుతూ.. ఇప్పటివరకు అధికారికంగా తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు.



రెండో రోజు పది నామినేషన్లు

- అసెంబ్లీకి ఆరు..
- లోక్ సభకు నాలుగు..

పార్వతీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి)/ సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం పది నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ఇప్పటివరకు శాసనసభ నియోజకవర్గాలకు ఏడు, అరకు పార్లమెంట్‌కు నాలుగు నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా రెండో రోజు పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర, స్వతంత్ర అభ్యర్థిగా గర్భాపు ఉదయ్‌భాను ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నిగ్ అధికారి కె.హేమలతకు అందించారు. పాలకొండ వైసీపీ అభ్యర్థి వి.కళావతి ఒక సెట్ నామినేషన్ పత్రాలను సీతంపేట ఐటీడీఏలో ఆర్వో కల్పనాకుమారికి అందజేశారు. సాలూరులో టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సి.విష్ణు చరణ్‌కు అందించారు. వైసీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర కూడా ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. కురుపాం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణకు అందజేశారు. ఇక అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థులుగా నిమ్మక జయరాజు, పాలక రంజిత్‌కుమార్, సీపీఎం అభ్యర్థి పి.అప్పలనరసయ్య, వైసీపీ అభ్యర్థి జి.తనూజారాణి తరఫున ఆమె ప్రతినిధి నామినేషన్ పత్రాలను కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు అందించారు. ఈ నెల 24, 25 తేదీల్లోనూ వైసీపీ, టీడీపీ అభ్యర్థులు మళ్లీ నామినేషన్ పత్రాలు సమర్పించనున్నట్లు తెలిసింది. కాగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.



పార్వతీపురంలో ఆర్వో హేమలతకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న టీడీపీ అభ్యర్థి విజయచంద్ర



సాలూరులో ఆర్వో విష్ణుచరణ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి

మందుబాబుల హడావుడి

జియ్యమ్మవలస: నామినేషన్ల దాఖల సందర్భంగా అంతటా మందుబాబుల హడావుడి కనిపించింది. మద్యం షాపుల ఎదుట భారీగా క్యూ కట్టారు. శుక్రవారం కురుపాం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పుష్పశ్రీవాణి నామినేషన్ వేసేందుకు కురుపాం వెళ్లారు. అయితే కొంతమంది వైసీపీ కార్యకర్తలు కూడా అక్కడకు తరలివెళ్లి ఆ గ్రామంలో మద్యం షాపుల ముందు బారులుతీరారు. కురుపాంలో ఏ చెట్ల కింద చూసినా వారే కనిపించారు. ఆ ప్రాంతాల్లోనే వారంతా మద్యం తాగుతూ సందడి చేశారు.

గంటలోనే లక్ష్యం పూర్తి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో నామినేషన్ దాఖలుకు శుక్రవారం నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. అయితే వారిలో చాలా మంది మద్యాన్ని తాగేందుకు ఆసక్తి చూపారు. ఇంకేమంది స్థానికంగా ఉన్న రెండు మద్యం షాపుల వద్దకు భారీగా చేరుకున్నారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటలకే ఆయా మద్యం షాపులు రోజువారీ విక్రయాల లక్ష్యం పూర్తయింది. దీంతో వెంటనే షాపులను మూసివేశారు. అయితే సాయంత్రం మద్యం దొరక్కపోవడంతో మందుబాబులు నిరాశ చెందారు.



సీతంపేటలో మూతపడిన మద్యం షాపు



కురుపాంలోని ఓ మద్యం షాపు వద్ద మందుబాబులు ఇలా..

మండిన మన్యం

- ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరి
- సీతంపేటలో అత్యధికంగా 46 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదు
- జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి..



సీతంపేటలో నమోదైన ఉష్ణోగ్రత



పాలకొండలో ఉష్ణోగ్రత ఇలా..



నిర్మానుష్యంగా పాలకొండ రహదారి

పాలకొండ/సీతంపేట/గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా ఎండలతో మండుతోంది. సూర్య ప్రతాపానికి విలవిల్లాడిపోతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలతో నిప్పుల కొలిమిగా మారింది. అధిక వేడి, ఉక్కపోత, వడగాల్పులకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించడం లేదు. దీంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలో శుక్రవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా పాలకొండలో 43, సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో 45, సీతంపేటలో 46 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వృద్ధులు, చిన్నారులతో పాటు అన్ని వయస్కుల వారు ఇళ్లలో ఉండలేక.. బయటకు రాలేక నానా యాతన పడ్డారు. కొన్నిచోట్ల విద్యుత్ కోతలు ఉండగా, రాత్రివేళల్లో కూడా వేడి తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడి నుంచి కాస్త ఉపశమనం కోసం కొందరు చెట్ల నీడను ఆశ్రయించగా, మరికొందరు శీతలపానియాలు తాగారు. పలుచోట్ల యువత నదులు, చెరువులు, కోనేరుల్లో స్నానాలు చేసి సేదతీరారు. ఏదేమైనా మరికొద్దిరోజుల పాటు గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో జిల్లావాసులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఇక మే నెలలో పరిస్థితేమిటోనని టెన్షన్ పడుతున్నారు. ఏదేమైనా ఎండల నేపథ్యంలో జిల్లావాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

ఆ నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదింటి వరకే..

- జిల్లాలో ఓటింగ్ సమయం ప్రకటించిన ఈసీ

పార్వతీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఓటింగ్ సమయాన్ని ఎన్నికల సంఘం ప్రకటించింది. వాస్తవంగా అన్నిచోట్లా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. కానీ జిల్లాలో మాత్రం పార్వతీపురం మినహా సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే ఓటింగ్ నిర్వహించాలని ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు పెద్దగా లేకపోయినప్పటికీ ఏజెన్సీ మండలాలు అత్యధికంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆయా చోట్ల పోలింగ్ పూర్తయిన అనంతరం ఈవీఎంల తరలింపు తదితర కార్యక్రమాలు చేపట్టేందుకు చాలా సమయం పట్టనుంది. గతే ఎన్నికల్లో కూడా పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇదిలా ఉండగా 'మన్యం'లో అనేక గిరి శిఖర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు నెట్‌వర్క్ సిగ్నల్స్ కూడా అందని పరిస్థితి. చాలా గ్రామాలకు రహదారులు కూడా లేవు. వాటిన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పోలింగ్ సమయాన్ని తగ్గించినట్లు సమాచారం.



బైండోవర్ అంటే తెలుసా?

కొమరాడ/శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల పోలింగ్ దగ్గర పడింది. మే 13న పోలింగ్ జరగనుంది. కొద్ది కాలంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికలు వచ్చాయంటే శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అధిక ప్రాధాన్యమిస్తారు. వీటికి విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతారు. గొడవలు సృష్టించేవారు... రౌడీషీటర్లు... బెల్ట్ దుకాణాలు నిర్వహించేవారు... నాటు సారా విక్రయించేవారు... ఇలా ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుంది. అలాంటి వారికి ముందస్తుగా పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తుంటారు.

బైండోవర్ అంటే (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అని అర్థం. ఎనికల వేళ ఫలానా వ్యక్తుల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావిస్తే... అతని చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే... పోలీసులు బైండోవర్ చేస్తారు. అలాంటి వ్యక్తులను తహసీల్దార్ లేదా ఆర్డీఓ ఎదుట హాజరు పరుస్తారు. చట్ట వ్యతిరేక పనులు చేయబోనని అతనిపై బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. సంబంధిత తహసీల్దార్ వారికి బైండోవర్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. సొంత పూచికత్తులపై ఆదేరోజు విడుదల చేస్తారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆ రోజు నుంచి ఏడాది వరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే లిఖిత పూర్వకంగా ఇచ్చిన బాండ్‌లో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటారో... అంత మొత్తం పెనాల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించకపోయినా నేరం కిందనే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద రెండు, అంతకన్నా ఎక్కువసార్లు బైండోవర్ అయితే అతనిపై రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎన్నికల వేళ గుంపులు గుంపులుగా వెళ్లి గొడవలు పడటం... శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వంటి చర్యలకు పాల్పడకూడదు. ఎవరైనా పౌరులు తమపై అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు. కోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేసి... రెండు వర్గాల వాదనలు విన్న తర్వాత కేసుపై నిర్ణయం తీసుకుంటుంది.

సో సెల్.. మీడియా!

ఎన్నికలంటే హోరెత్తించే మైకులు.. గోడల మీద రాతలు.. లక్షలకొద్దీ కరపత్రాలు.. ఊరూవాడా వాల్‌పోస్టర్లు.. ఇదంతా గతం. ప్రచార సరళి ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ప్రచారంలో సెల్‌ఫోన్ కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యమైన సమాచారాన్ని క్షణాల్లో తమ అనుచరులకు చేరవేస్తున్నారు. అభ్యర్థులకు సమయం ఎంతో ఆదా అవుతోంది. సామాజిక మాధ్యమాలను తమ ప్రచారాలకు ప్రధాన సాధనాలుగా వాడుకుంటున్నారు.

- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రచారం
- యూట్యూబ్‌లో అప్‌లోడ్.. లైవ్ వీడియోలు
- ప్రచారాల ఫొటోలు కూడా..





(రాజాం రూరల్)

గత ఎన్నికల్లో ఎస్సెమ్మెస్‌లకే పరిమితమైన ప్రచారం.. ఈసారి ఆధునికతను అందిపుచ్చుకుంది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రాజకీయ పార్టీల నాయకులు ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. సోషల్ మీడియా ఇప్పుడు ప్రధాన పాత్ర పోషిస్తోంది. తమ నాయకుడు ఏ రోజు.. ఏ సమయానికి.. ఏ వీధికి.. ఏ ప్రాంతానికి, ఏ గ్రామానికి ప్రచారానికి వస్తున్నారో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లిన క్షణాల్లోనే ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందుకోసం అన్ని పార్టీల అభ్యర్థులూ ఒక్కొక్కరు కనీసం నలుగురైదుగురిని నియమించుకొని.. తమ రోజువారీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారు.

లైవ్ వీడియోలు..

దాదాపుగా ప్రచారంలో లైవ్ వీడియోలకు ప్రాధాన్యం పెరిగింది. నాయకుడు గ్రామంలోనికి అడుగుపెట్టింది మొదలు ప్రజలతో మమేకమవుతూ.. తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న ప్రతి సన్నివేశాన్ని లైవ్‌ద్వారా ఫేస్‌బుక్.. యూట్యూబ్‌లలో ప్రచారం చేస్తున్నారు. అభిమానులు, కార్యకర్తలు కూడా ఇదే పంథాలో నాయకులను అనుసరిస్తున్నారు.

వాట్సాప్ గ్రూపులలో...

ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి వాట్సాప్ గ్రూపుల ద్వారా వందలాది మందికి చేరవేస్తున్నారు. పార్టీలు, కులాలు, కుటుంబాలు, ఉద్యోగ సంఘాలు, మీడియా, అధికారులు, ఇతరత్రా గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. అక్కడి నుంచి క్షణాల్లో మిగిలిన వారు షేర్ చేస్తున్నారు. దీంతో అత్యంత వేగంగా ప్రచారం జనంలోకి వెళ్లిపోతోంది. ఫలితంగా తక్కువ ఖర్చు...స్వల్ప సమయంలో వేలాదిమందికి సమాచారం చేరవేస్తున్నారు.

యూట్యూబ్‌లో...

ప్రస్తుతం యూట్యూబ్‌కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేకంగా వీడియోలను తయారు చేయిస్తున్నారు. పార్టీల హామీలను... గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... భవిష్యత్‌లో చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లక్షలాది మంది వీక్షకులకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు.



అందరిదీ అదే బాట..

జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల నుంచి కూటమి, అధికార పార్టీల నుంచి 14 మంది శాసనసభకు.. ఇద్దరు లోక్‌సభకు పోటీలో ఉన్నారు. నామినేషన్ల పర్వం పూర్తయ్యేసరికి మరికొంత మంది అభ్యర్థులు బరిలో ఉండే అవకాశాలు లేకపోలేదు. వీరిలో కూటమి, అధికార పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేకంగా సోషల్‌మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ ప్రచారానికి సంబంధించిన ప్రతి చిన్న విషయం ప్రజల్లోకి చొప్పిస్తున్నారు. అన్నివర్గాల ప్రజలు సైతం ఎప్పటికప్పుడు లైవ్‌లో వస్తున్న ప్రచారాలను చూసి తమకు నచ్చినవారి ప్రచారాలు 'షేర్' చేస్తున్నారు. అభ్యర్థుల గుణగణాలతో పాటు వారి హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే అభినందిస్తున్నారు. ఉత్సవ విగ్రహాలుగా అధికారాన్ని అనుభవించిన వారి పట్ల దురుసుగానే కామెంట్ల రూపంలో జవాబులిస్తున్నారు.



మహిళల ఆశీర్వాదమే కీలకం

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లే కీలకంగా మారారు. గత రెండు దశాబ్దాలుగా వీరి తీర్పే అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తోంది. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉండడం... గంపగుత్తగా ఓట్లు వేయడం వల్ల వీరి ప్రభావం అధికంగా ఉంది. 2024 ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలో సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో 2019 నాటికి మొత్తం 1,84,414 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రకారం 287 పోలింగ్ కేంద్రాల్లో 1,93,667 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 94,328 మంది. మహిళలు 99,325, ఇతరులు 14 మంది ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి అదనంగా 11 వేల ఓట్లు నమోదయ్యాయి. ఇప్పుడు కూడా మహిళలే కీలకపాత్ర పోషించబోతున్నారు. మరి వీరంతా ఎవరిని ఆశీర్వదిస్తారో చూడాలి.

పారాది వంతెన కథ అంతేనా?

- పాతది పటిష్ఠం చేస్తారట
- కొత్తదానిపై ఆశలు వదులుకోవాల్సిందేనా?
- వైసీపీ మాటలు నీటి మూటలేనా?

(బొబ్బిలి)

బొబ్బిలి-విజయనగరం రాష్ట్రీయ రహదారిలో పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించ తలపెట్టిన వంతెన ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆనవాలుగా కనిపిస్తోంది. కొత్త వంతెన పనులు ఇప్పట్లో కదిలేలా లేవు. మళ్లీ పాత వంతెననే పటిష్ఠ పరిచేందుకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు. ఈ పనుల కోసం నిధుల వేట ప్రారంభమైంది. ఇంజనీరింగ్ నిపుణులను తెప్పించి బ్రిటిష్ కాలం నాటి పాతవంతెనను రవాణాకు అనుకూలంగా పటిష్ఠపరచడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పనుల కోసం సుమారు రూ.40 లక్షలు అవసరం ఉంటుందని అంచనా. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ వంతెన పనులు వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వంతెన నిర్మాణం కోసం రూ.10.90 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ ఆ కాంట్రాక్టరుకు గతంలో చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో ... ఈ పనులు చేపట్టేందుకు తటపటాయించినట్టు తెలుస్తోంది. దీనితో వంతెన నిర్మాణ వ్యయం రూ.13.82 కోట్లకు చేరుకుంది. పనులలో జాప్యమే ఇందుకు కారణం. 12 శాతం ఉండే జీఎస్‌టీ 18 శాతానికి పెరగడంతో అంచనా వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది.



గతంలో వంతెనపై వేసిన బీటీ రోడ్డు (ఫైల్)



శిథిలమైన వంతెనను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు (ఫైల్)

గ్రామీణ రహదారులకు కష్టం

బ్రిటిష్ కాలం నాటి ఈ వంతెన కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో గత ఏడాది అక్టోబరులో తాత్కాలికంగా నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. భారీ వాహనాలన్నిటినీ దారి మళ్లించారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంత రహదారులన్నీ దెబ్బ తింటున్నాయని ఆ గ్రామాల ప్రజలు.. వివిధ రాజకీయ పార్టీల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఆందోళనలు

తెలుగుదేశం, జనసేన, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు ఈ వంతెన కోసం అనేకసార్లు ఆందోళన చేశాయి. దారి మళ్లించే వాహనాల కోసం వేగావతి నదిలో వంతెనకు సమీపంలోనే అప్రోచ్ రోడ్డు నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీనితో భారీ వాహనదారులు మళ్లించిన దారిలో వెళ్లడం... గ్రామీణులు ఇబ్బందులకు గురవడం షరా మామూలైంది.

నిపుణులను రప్పిస్తున్నాం

పాత వంతెనను మరింత పటిష్ఠ పరిచి వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చేందుకు నిపుణులను రప్పిస్తున్నాం. దీని కోసం రూ.40 లక్షలు అవసరమని భావిస్తున్నాం. విద్యుత్ లైన్లు మార్చాల్సి ఉంది. కాంట్రాక్టు ఏజెన్సీకి బిల్లులు పెండింగ్ ఉన్నమాట వాస్తవమే.

- జీవీ రమణ, ఈఈ, ఆర్అండ్‌బీ, విజయనగరం

అప్రోచ్ రోడ్డు పూర్తయినా..

వంతెనకు ప్రత్యామ్నాయంగా నదిలో అప్రోచ్ రోడ్డు నిర్మించే బాధ్యతలను టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరుకే అప్పగించారు. ఆ పనులను ఇటీవల పూర్తి చేశారు. అప్రోచ్ రోడ్డుపై ట్రయల్ రన్ కూడా వేశారు. వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. దీనితో కొత్త వంతెన పనులు ప్రారంభమైపోతాయని అంతా అనుకున్నారు. కానీ పాతవంతెనను మరింత పటిష్ఠ పరిచేందుకు కలెక్టర్, జిల్లా పరిషత్ నుంచి నిధులను సమీకరించాలని అధికారులు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొత్త వంతెన కోసం వైసీపీ నాయకులు హడావిడి చేశారని... ఇప్పుడేమో పాత వంతెన పనులు అంటున్నారని... ఇదెక్కడి చోద్యమని జనం విస్తుపోతున్నారు.



పారాది వద్ద వేగావతి నదిపై ఇటీవల నిర్మించిన అప్రోచ్ రోడ్డు

పైసా ఖర్చు చేయకుండానే ఎమ్మెల్యేగా..

- నిస్వార్థ ప్రజాసేవకు నిదర్శనం అడ్డాకుల లక్ష్మునాయుడు

గుమ్మలక్ష్మీపురం: ఒకప్పటి శ్రీకాకుళం జిల్లా... నేటి విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గ్రామానికి చెందిన అడ్డాకుల లక్ష్మునాయుడు పైసా ఖర్చు చేయకుండా 1955లో ఆగూరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఇది కురుపాం శాసనసభ నియోజకవర్గంగా మారింది. ఆ తర్వాత ఆయన 1962లో మళ్లీ అదే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. నిస్వార్థంగా సేవలు అందించారు. 1904లో పుట్టిన ఆయన 1972లో కన్నుమూశారు. ఆయన కుమారుడు అడ్డాకుల గుండునాయుడు గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. గుండునాయుడు కుమారుడు గంగరాజు, కుమార్తె సర్పంచ్‌లుగా పనిచేశారు. ప్రస్తుత టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి భర్త సన్యాసినాయుడు ఈ అడ్డాకుల కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. గిరిజన ప్రాంతంలో ఈ కుటుంబానికి మంచి పేరు ఉంది.




అడ్డాకుల లక్ష్మునాయుడు(ఫైల్)



నోటరీలో జాగ్రత్త

తెలుసుకోండి

కొమరాడ: ఉమ్మడి జిల్లాలో నామినేషన్ వేసే అభ్యర్థులు నోటరీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా నామినేషన్‌తో పాటు లైసెన్స్‌డ్ అడ్వొకేట్‌తో నోటరీ చేయించాలి. వీరిని గుర్తించడంలో అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన అవసరం. ఆదాయం, స్థిర, చరాస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర అంశాలను పొందుపరిచి... 13 డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్ పత్రంతో పాటు వివరాలను ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌పై నోటరీ సమర్పించాలి. జిల్లాలో చాలామంది అడ్వొకేట్లు నోటరీ లైసెన్సులు గడువు ముగిశాక రెన్యూవల్ దరఖాస్తు పంపి నోటరీగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖ అనుమతి ఇస్తుంది. కొంతమంది గతంలో నోటరీ లైసెన్స్ పొంది... తర్వాత రెన్యూవల్ చేసుకోకుండా కొనసాగుతున్నట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో నోటరీ పొందిన అడ్వొకేట్ల సమాచారం అందుబాటులో ఉంచారు. వీరి పేర్లను జిల్లా ఎన్నికల అధికారితో పాటు శాసన సభ రిటర్నింగ్ అధికారులకు కూడా పంపారు. రెన్యూవల్ చేయని వారు ధ్రువీకరిస్తే నామినేషన్లు చెల్లుబాటు కావని అభ్యర్థులు గుర్తించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.



1952లో తొలిసారి ఎన్నికలు

మీకు తెలుసా?

(విజయనగరం రూరల్)

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశంలో తొలిసారి 1952లో శాసనసభ, లోకసభకు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో విజయనగరం ఉమ్మడి జిల్లా. బొబ్బిలి లోకసభ పరిధిలో విజయనగరం ఉండేది. 1952లో తొలి ఎంపీగా స్వాతంత్ర్య సమరయోధుడు కేఎస్ తిలక్ ఎన్నికయ్యారు. అదే ఏడాది విజయనగరం అసెంబ్లీ రిజర్వుడు స్థానానికి గంట్లాన సూర్యనారాయణ ఎన్నికయ్యారు. అసెంబ్లీ జనరల్ స్థానానికి డాక్టర్ పీవీజీ రాజు ఎన్నికయ్యారు. వీరు ముగ్గురూ మిత్రులే. సైకిళ్లపై తిరిగి ఎన్నికల ప్రచారం చేసేవారు. ప్రజలు చేస్తున్న పనుల్లో మమేకమై.. శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహించి.. ప్రశంసలు అందుకునేవారు.

● నెల్లిమర్ల నియోజకవర్గ ముఖచిత్రం

ప్రతిసారీ.. మార్చేస్తున్నారు!

● ఇదీ నెల్లిమర్ల ఓటర్ల తీరు ● 2009లో ఆవిర్భావం
● అంతకుముందు సతివాడ నియోజకవర్గం
● బడ్డుకొండ రెండుసార్లు... పతివాడ ఒకసారి విజయం
● తొలిసారి బరిలోకి జనసేన అభ్యర్థి
● రామతీర్థం పుణ్యక్షేత్రం ఇక్కడే..





సువిశాల సాగరతీరం... ప్రసిద్ధి చెందిన శ్రీరాముని ఆలయం...చైతన్యం గల ఓటర్లను కలిగిన నేపథ్యం... నెల్లిమర్ల నియోజకవర్గం సొంతం. రాజకీయ ఉద్దండులను అందించిన ప్రాంతమిది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన నెల్లిమర్ల నియోజకవర్గ ఓటరు ప్రతి ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేలను మార్చేస్తున్నారు.

(నెల్లిమర్ల)

విజయనగరం జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించే నియోజకవర్గం నెల్లిమర్ల. దీనికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. విశాలమైన సముద్ర తీరం. పొడవైన జాతీయ రహదారి ఉన్నాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల పరిధిలో సుమారు 20 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వందేళ్ల చరిత్ర కలిగిన నెల్లిమర్ల జూట్ మిల్లుతో పాటు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన పుణ్యక్షేత్రం రామస్వామి వారి దేవస్థానం నెల్లిమర్ల మండలం రామతీర్థం గ్రామంలో ఉంది. జిల్లాలో ఏ నియోజక వర్గంలో లేని ఫార్మా కంపెనీలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. తలసరి ఆదాయ పరంగా చూస్తే విజయనగరం జిల్లాలోని మిగిలిన నియోజక వర్గాల కన్నా ఇక్కడ ఎక్కువేనని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురంలోనే ఉంది. అపర భగీరథిగా పిలవబడే తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఇదే నియోజకవర్గంలో ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలోని సాగు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. నియోజకవర్గంలో 90 శాతం బీసీలే. అందులో తూర్పు కాపు సామాజిక వర్గం అధికం. ఆ తర్వాత యాదవులు, తెలగ కులస్థులు, మత్స్యకారులు, ఇతర సామాజిక వర్గాల వారు ఉంటారు. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2.13.168 మంది ఉన్నారు.



పెనుమత్స సాంబశివరాజు




పతివాడ నారాయణ స్వామి నాయుడు



పొట్నూరు సూర్యనారాయణ



బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల జ్యూట్ పరిశ్రమ



ప్రసిద్ధి చెందిన రామతీర్థం శ్రీరాముని ఆలయం

సతివాడలో ఇలా..

సతివాడ నియోజకవర్గంలో నెల్లిమర్లకు చెందిన దివంగత బయిరెడ్డి సూర్యనారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. గుర్ల మండలం పాలవలసకు చెందిన దివంగత పొట్నూరు సూర్యనారాయణ సతివాడ నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా నాలుగుసార్లు పోటీ చేసి 1994లో ఒకసారి విజయం సాధించారు. గతంలో విశాఖపట్నం పార్లమెంటు పరిధిలో ఉన్న భోగాపురం నియోజకవర్గానికి చెందిన దివంగత కొమ్మూరు అప్పడుదొర, దివంగత కొమ్మూరు సంజీవరావు క్రియాశీల రాజకీయాల్లో ఉండేవారు. అప్పడుదొర విశాఖ ఎంపీగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేశారు. సంజీవరావు భోగాపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాలుగు సార్లు పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఒకసారి విశాఖపట్నం ఎంపీగా గెలుపొందారు.

2009లో ఆవిర్భావం..

ఒకప్పుడు ఇది సతివాడ నియోజకవర్గం. పునర్విభజన అనంతరం 2009లో నెల్లిమర్ల నియోజకవర్గం ఆవిర్భవించింది. అంతకుముందు ఉన్న సతివాడ నియోజక వర్గం నుంచి నెల్లిమర్ల మండలాన్ని, భోగాపురం నియోజక వర్గం నుంచి పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాలతో కలిపి కొత్తగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గం ఆవిర్భావం తరువాత 2009, 2014, 2019 సంవత్సరాల్లో సాధారణ ఎన్నికలు జరిగాయి. తాజాగా నెల్లిమర్ల నియోజకవర్గంలో నాలుగోసారి సాధారణ ఎన్నికలు జరుగుతున్నాయి.

ఓటర్ల వివరాలు

పురుషులు	1,05,411 మంది
స్త్రీలు	1,07,754
ట్రాన్స్ జెండర్లు	3
మొత్తం	2.13,168 మంది
పోలింగ్ స్టేషన్లు	248

నెల్లిమర్ల నియోజక వర్గం ఎమ్మెల్యేలు..

సం.	పేరు	పార్టీ
2009	బడ్డుకొండ అప్పలనాయుడు	(కాంగ్రెస్)
2014	పతివాడ నారాయణస్వామి నాయుడు	(టీడీపీ)
2019	బడ్డుకొండ అప్పలనాయుడు	(వైసీపీ)


గత మూడుసార్లు ఫలితాలు ఇలా..

ఈ నియోజక వర్గంలో గత మూడుసార్లు ఫలితాలను పరిశీలిస్తే.. ఒక్కో ఎన్నికల్లో ఒక్కో పార్టీకి ఓటర్లు అవకాశం ఇచ్చారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బడ్డుకొండ అప్పలనాయుడు, 2014లో టీడీపీ తరఫున పోటీ చేసిన పతివాడ నారాయణస్వామినాయుడు, 2019లో వైసీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు విజయం సాధించారు. బడ్డుకొండ అప్పలనాయుడు ఇంత వరకు మూడుసార్లు పోటీ చేసి.. రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తాజాగా నాలుగోసారి ఎన్నికల బరిలో దిగారు. టీడీపీ సీనియర్ నాయకుడు పతివాడ నారాయణస్వామినాయుడు భోగాపురం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో మొత్తం 8సార్లు పోటీ చేసి ఏడుసార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఈసారి ఆయనకు టిక్కెట్ దక్కలేదు. పొత్తులో భాగంగా ఈ నియోజక వర్గం నుంచి జనసేన అభ్యర్థి లోకం నాగమాధవికి టిక్కెట్ కేటాయించారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని నెల్లిమర్ల మండలం మొయిద విజయరాంపురం గ్రామానికి చెందిన దివంగత పెనుమత్స సాంబశివ రాజు కూడా సతివాడ నియోజకవర్గం నుంచి ఎనిమిదిసార్లు పోటీ చేసి ఏడుసార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఆయన కుమారుడు డాక్టర్ పీవీవీ సూర్య నారాయణరాజు (సురేష్‌బాబు) ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.



భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు (ఫైల్)

'ఆ'పాత' మధురం



1983లో టీడీపీని గెలిపించాలని సాలూరులో ప్రచారం చేస్తున్న ఎన్టీఆర్

ఎన్టీఆర్‌తో రాజయ్య

సాలూరు రూరల్: టీడీపీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు 1983 ఎన్నికల్లో అప్పటి సాలూరులోని అభ్యర్థి బోయిన రాజయ్యను తన చైతన్యరథంపై ఎక్కించి ప్రచారం చేశారు. అప్పట్లో ప్రచారం చేస్తున్న ఫొటో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అప్పట్లో రాజకీయాలకు పరిచయం లేని ఉపాధ్యాయుడు బోయిన రాజయ్యకు ఎన్టీఆర్ టిక్కెట్ ఇచ్చి గెలిపించారు. ప్రస్తుత ఎన్నికల తరుణంలో ఈ ఫొటోను అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.



ఇక్కడ మందుకు కొదువలేదు..

ఫుల్లుగా మందు

బొబ్బిలి, ఏప్రిల్ 19: బొబ్బిలి సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శంబంగి వెంకటచినఅప్పలనాయుడు శుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా మద్యం యథేచ్ఛగా పంపిణీ చేయడం కనిపించింది. ఆర్డీవో కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీలో ఎక్కడికక్కడ మద్యం ఇచ్చారు. స్థానిక ఫ్లైఓవర్ ముందు శంబంగి ఎన్నికల ప్రచార వాహనంపై మాట్లాడారు. ఆ సమయంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆటోలు, వ్యాన్‌లు ఇతర వాహనాలతో జనాలను తరలించారు. వీరందరికీ డబ్బులు, మద్యం, బిరియానీ ప్యాకెట్లు స్థానిక నాయకులతో పంపిణీ చేయించారు.



ఇక్కడ నీటికి దిక్కులేదు.. వాటర్ బాటిల్స్ కోసం తోపులాట

నామినేషన్ల పర్వం

సార్వత్రిక ఎన్నికల ఘట్టంలో రెండో రోజు శుక్రవారం వివిధ పార్టీల అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఆలయాల్లో ప్రార్థనలు చేసి... నామినేషన్ పత్రాలను తమ ఇష్ట దైవాల ముందు ఉంచి పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అధికారులకు సమర్పించారు.



విజయనగరం: టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడికి గజమాల



శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న కలిశెట్టి





రాజాం: శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళుతున్న ఉమ్మడి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్





నెల్లిమర్ల: ర్యాలీగా వెళ్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి నాగమాధవి

పునాదులతోనే ఆపేశారు

- లక్ష్మీపురంలో అర్థాంతరంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు
- అద్దె భవనాల్లోనే కార్యాలయాల నిర్వహణ



పునాదులకే పరిమితమైన సచివాలయ భవన నిర్మాణం

సీతానగరం: సీతానగరం మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణ పనులు రెండేళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి. మూడేళ్ల కిందటే పనులు ప్రారంభించి, పునాదుల వరకు మాత్రమే పూర్తి చేసి వదిలేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్, ఇనుము పక్కదారి పట్టాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కార్యాలయాలూ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఇదే పంచాయతీలో పాల శీతలీకరణ కేంద్ర నిర్మాణానికి ముందుగా రెండు లక్షల బ్యాంకు ఖాతా నుంచి తీసినా పనులు చేపట్టలేదు. వీటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని బల్క్ కూలింగ్ సెంటర్ నిధులు, ఇతర నిర్మాణ పనుల చెల్లింపులు మినహాయిస్తామని ఏఈ చంద్రమౌళి తెలిపారు.

నాడు-నేడు అని నట్టేట ముంచారు

- అర్థాంతరంగా కొండనిడగళ్లు ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు
- పూర్తి స్థాయిలో విడుదల కాని నిధులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

(జియ్యమ్మవలస)

పాఠశాలల రూపు రేఖలు మార్చేస్తాం. కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని ప్రభుత్వ పెద్దలు బాకాలు ఊదారు. దీని కోసం నాడు - నేడు అనే పథకాన్ని ప్రవేశపెట్టి లక్షల కోట్ల రూపాయలు నిధులు వెచ్చించారు. అయితే కొన్ని పాఠశాలలకు నిధులు అందక, ఉన్న భవనాలను కూల్చేసి రెంటికి చెడ్డ రేవడిలా తయారయ్యాయి. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం మండలంలోని కొండనిడగళ్లు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్) దుస్థితి.

ఈ పాఠశాల రెండో విడత నాడు-నేడు జాబితాలో ఎంపికయ్యింది. దీనికి రూ.30 లక్షలు మంజూరైంది. అయితే 2022లో రూ.8లక్షలు విడుదలైన తర్వాత పాఠశాల నిర్మాణం ప్రారంభమయ్యింది. ఇచ్చిన డబ్బులకు బిల్డింగ్ నిర్మాణం శ్లాబ్ వేసినంతవరకు సరిపోయింది. దీనికి ఆ పాఠశాలను నిర్మించిన మేస్త్రీ వీరబాబు తన చేతి డబ్బులు లక్ష రూపాయలు వెచ్చించి పాఠశాలకు చెక్క సున్నాలు వేశాడు. కానీ అతని డబ్బులు అతనికి అందని పరిస్థితి. బిల్డింగ్ అయితే పూర్తయింది గానీ గచ్చులు, తలుపులు, కిటికీలు, కాంపౌండ్ వాల్ నిర్మాణం ఇంకా జరగకపోవడంతో అసంపూర్ణంగా ఉన్న భవనంలోనే తరగతులు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో 35 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, హెచ్ఎం వంజరాపు ప్రమీల, ఉపాధ్యాయుడు ఆరిక వినోద్ సక్రమంగా బోధన అందిస్తున్నారు. అయితే మధ్యాహ్న భోజన పథకం వంటకాలు పక్కనే బోధించాల్సిన పరిస్థితి ఉంది. అలాగే 2024 ఫిబ్రవరిలో నాడు-నేడు పథకం కింద మరో రూ.3లక్షలు మంజూరయ్యింది. దీంతో మరుగుదొడ్ల నిర్మాణాలు చేయాలని ఆదేశాలు వచ్చాయని, త్వరలో నిర్మాణాలు చేపడతామని హెచ్ఎం ప్రమీల తెలియజేశారు. అంటే మంజూరైన రూ.30 లక్షలకు ఇంతవరకు రూ.11లక్షలే మంజూరవ్వడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఇక ఈ పాఠశాల ముఖ్యమైన రికార్డులు కొన్ని ఆయా ఆరిక పూర్ణ ఇంట్లోను, మరికొన్ని రికార్డులు కుక్ మండంగి రజని ఇంట్లో ఉంచుతున్నారు.

ఇవీ సమస్యలు

కొండనిడగళ్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టిమిట్టాడుతోంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా కనీసం స్పందించడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

- ఈ పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మంచినీటి కోసం ఇళ్లకు వెళ్లి అక్కడి కలుషిత నీరే విద్యార్థులు తెచ్చుకుంటున్నారు.
- పాఠశాల పక్కనే కొండ ఉండటం వల్ల వర్షం వస్తే నీరంతా పాఠశాల ఆవరణలోకి వచ్చేస్తుంది. కావున ప్రహరీ అత్యవసరం.
- పాఠశాలకు మరుగుదొడ్లు లేకపోవడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- పాఠశాలకు సరైన వసతి లేదు. రికార్డులకు భద్రత లేదు.



అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇదే

రూ.11లక్షలే వచ్చాయి



మా పాఠశాల నాడు-నేడు ఫేజ్-2లో ఎంపికయ్యింది. రూ.30లక్షలు మంజూరు చేశామని ఆర్డర్ వచ్చింది. కానీ ఇంతవరకు రూ.11లక్షలే రిలీజ్ అయ్యాయి. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- వంజరాపు ప్రమీల, హెచ్ఎం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కొండనిడగళ్లు

పిచ్చి కుక్క స్వైరవిహారం

- 9 మందికి తీవ్ర గాయాలు



మహిళ చేతికి కుక్కగాట్లు

బొండపల్లి, ఏప్రిల్ 19: బొండపల్లి గ్రామంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం గ్రామంలోని యాత వీధిలో ఓ పిచ్చికుక్క ఆరుబయట ఉన్నవారిపై విచక్షణా రహితంగా దాడిచేసి కరి చింది. దీంతో స్థానికులు కుక్కను కర్రలతో భయపెట్టగా అక్కడ నుంచి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న టీపాయింట్‌కు సమీపంలో మరికొంతమందిపై దాడిచేసి కరిచింది. అక్కడ నుంచి జాతీయ రహదారి పక్కన తాటిముంజెలు అమ్ముకుంటున్న వారిపై, రోడ్డుపక్కన లారీ ఆపిన డ్రైవర్‌పై కూడా దాడిచేసి గాయపరిచింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన పి.అచ్చియ్యమ్మ, బి.కృష్ణమ్మ, బి.సంతోష్, కే.సురేష్, పి.రామలక్ష్మి, వైసన్యాసికి తీవ్ర గాయాలు కాగా వీరిని బొండపల్లిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. బొండపల్లి పీహెచ్‌సీలో నీలాతి రాము, పురం రామ లక్ష్మి, ఎర్ర సన్యాసి చికిత్స పొందుతున్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండా లని దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బాడంగి: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆనవరం గ్రామా నికి చెందిన తూముల విజయ్‌కుమార్(23) మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని చికిత్సలు తీసుకున్నా కడుపునొప్పి తగ్గకపోవ డంతో విరక్తి చెంది గురువారం ఉదయం గ్రామ సమీపంలోని అరటితోటలో పు రుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మృతు డి సోదరుడు, స్నేహితులు బొబ్బిలిలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరు గైన వైద్యం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి తూముల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

- వైసీపీ కార్యకర్తలను తరలిస్తున్న ఆటో ఢీకొనడంతో ఘటన

బొబ్బిలి: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి జనాలను తరలిస్తున్న ఆటో ఢీకొని మోటారుబైకుపై వెళుతున్న యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. తెర్లాం మండలం కూనాయవలస నుంచి వైసీపీ తరపున జనాలను తరలించి వెళుతున్న ఆటో స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియం జంక్షన్ దగ్గర రాజాన దిలీప్ అనే యువకుడిని బలంగా ఢీకొంది. బొబ్బిలి రంగరాయపురం గ్రామానికి చెందిన దిలీప్ ప్రైవేట్ కొరియర్ సంస్థలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కళాభారతి పక్క సందు నుంచి బైకుపై వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దిలీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికి త్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసులో కూనాయవలసకు చెందిన ఆటో డ్రైవర్ సింహాచలంను అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

అన్యాయంగా అట్రాసిటీ కేసు



ఏఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బీసీ కులస్థులు

రామభద్రపురం: మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో ఎస్సీ కులస్థులు తమపై అన్యాయంగా అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని బీసీ కులాలకు చెందిన కోరుకొండ సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సుమారు వందమంది ఏఎస్ఐ చిన్నయ్యకు వినతిపత్రం అందించారు. తమ జిరాయితీ భూమిని ఆక్రమించుకోవడానికి ఇటువంటి కుట్రలు పన్నుతున్నారని, తాము కులంపేరుతో తిట్టలేదని స్పష్టం చేశారు. ఆ భూమికి సంబంధించి అన్ని హక్కులు ఉన్నాయని, దీనిపై స్పందనలో ఫిర్యాదు చేసిన వెంటనే తహసీల్దార్ సర్వేయర్‌ను పంపించి ఆ భూమికి హద్దులు చూపించి ఎండోర్స్‌మెంట్ తమకిచ్చారని తెలిపారు. అయినప్పటికీ అదే గ్రామానికి చెందిన దుక్క త్రినాథ, మరికొంతమంది తాము నిర్మిస్తున్న ఇంటి వద్దకు వచ్చి తమను తీవ్రంగా గాయపరచి మళ్లీ తమపైనే ఫిర్యాదు చేశారన్నారు. దీని పై పోలీసులు విచారించి తమపై తప్పుడు కేసులు పెట్టిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం సీసాల స్వాధీనం

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఎల్.అప్పలనాయుడు అనే వ్యక్తిని శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి ఆయన వద్ద 96 మద్యం సీసాలు, ఒక బైకు కూడా స్వాధీనం చేసుకున్నారు.

గౌతు లచ్చన్నకు నివాళి



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గజపతినగరం: కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా చట్ట సభల్లో గౌతు లచ్చన్న తన గళం విప్పేవారిని అటువంటి వ్యక్తి ఆశయాలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమని కల్లు గీత కార్మికుల జిల్లా అధ్యక్షు డు కొల్లి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళుల ర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు వచ్చే ప్రభుత్వం చొరవ చూపాలని, అలాగే కల్లుగీత సంఘానికి 10 సెంట్ల స్థలం మంజూరు జరిగే వరకు పోరాటం సాగిస్తామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు, కోలిసి సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

సాలూరును ఏం అభివృద్ధి చేశారు?

- కూటమి అభ్యర్థి సంధ్యారాణి



సాలూరులో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

సాలూరు: సుమారు 18ఏళ్లు ఎమ్మెల్యేగా, రెండున్నర ఏళ్ల పాటు మంత్రిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉండి సాలూరు నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి.. ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను ప్రశ్నించారు. శుక్రవారం సాలూరులో నామినేషన్ సమర్పించిన అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్థానిక వైసీపీ నేత సుమారు 18ఏళ్లగా పదవిలో ఉండి సాలూరుకు, సాలూరు నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతూ సంధ్యారాణి ఒక సెట్ నామినేషన్ ముహూర్తం ప్రకారం వేశారని, ఈనెల 25న పార్టీ శ్రేణులతో కలిసి మళ్లీ మరో సెట్ నామినేషన్ వేస్తారని తెలిపారు. అనంతరం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

- సాలూరు మండలం అన్నంరాజువలస పంచాయతీ పందిరిమామిడివలస, కుద్దాడవలస, చీపురువలస తదితర గ్రామాల్లో కూటమి అభ్యర్థి సంధ్యారాణి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆముదాల పరమేశు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో విజయచంద్ర ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రం పార్వతీపురంలోని 26వ వార్డులో టీడీపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, బార్నాల సీతారాం, కోరాడ నారాయణరావు, బడే గౌడ్‌నాయుడు, పి.వెంకటరమణ, జి.రవికుమార్, మజ్జి వెంకటేష్, పాలకొండ మరియదాసు, పాలకొండ రాజశేఖర్, గంట శ్రీను, శొంటేను మురళీ, చుక్క పోలినాయుడు, జనసేన నాయకులు అనీల్, గోవిందమ్మ, బీజేపీ నాయకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మీకు పెట్టుబడి పెట్టి నేను నష్టపోయా

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిపై ఎంపీపీ సురేష్ ఆగ్రహం

జియ్యమ్మవలస: 'మిమ్మల్ని నమ్ముకుని ఉపాధ్యాయ వృత్తి వదిలేసి నేను సంపాదించిన డబ్బుతో మీకు పెట్టుబడి పెట్టి నేను పూర్తిగా నష్టపోయాన'ని ఎంపీపీ బొంగు సురేష్.. కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, ఆమె భర్త శత్రుచర్ల పరీక్షిత్ రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు. శత్రుచర్ల వంశాన్ని నాశనం చేసిన వ్యక్తి పరీక్షిత్ రాజున్నారు. 2014, 2019లో ఏ విధంగా ఆర్థికంగా ఎదిగారో తనకు తెలుసన్నారు. మజీ ఎమ్మెల్యే జనార్దన్ థాట్రాజ్ అకాల మరణంతో పుష్ప శ్రీవాణి అహంకారం పెరిగిపోయిందని ఆయన ఆరోపించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

జియ్యమ్మవలస: మండలంలో గల బాసంగి, గవరంపేట గ్రామాల్లో చినమేరంగి పోలీసులు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. గురువారం స్థానిక ఎస్ఐ చిన్నం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో 48 కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు సుమారు 5 కిలోమీటర్లు కవాతు నిర్వహించారు. ఈసందర్భగా ఎస్ఐ చిన్నంనాయుడు మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు లోను కాకుండా స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి



మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి

జియ్యమ్మవలస: 'నన్ను ఆశీర్వదించి గెలిపించండి.. కురుపాం నియోజక వర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తా' అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. జియ్యమ్మవలసలో టీడీపీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. పదేళ్లు ఎమ్మెల్యేగా, రెండేళ్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పదవులు అనుభవించిన పుష్పశ్రీవాణి గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు.. నియోజకవర్గం అభివృద్ధిని విస్మరించారన్నారు. 'నేనే మీ ఇంటి ఆడపడుచుగా వచ్చాను.. నన్ను ఆశీర్వదించి ఓటేయండి.. మీ అందరి చల్లని దీవెనలే నాకు శ్రీరామరక్ష' అన్నారు. ఈనెల 22వ తేదీన నామినేషన్ వేస్తున్నానని అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు రావాలని ఆమె పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావు, ఎంపీపీ బొంగు సురేష్, డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు మల్లేసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక



పార్టీలో చేరినవారితో కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ

పాలకొండ: పొట్లి గ్రామంలో వైసీపీ నాయకుడు, సర్పంచ్ గొర్లె కృష్ణ తన అనుచరులతో శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ జనసేన కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గొర్లె గోవిందరావు, బెజ్జిపురపు స్వాతి, రాంబాబు, గొర్లె సాంబినాయుడు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, గర్భాన సత్తిబాబు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, తేజోవతి, తాడంగి సునీత పాల్గొన్నారు.

అవలంగిలో వైసీపీకి షాక్

పాలకొండ: అవలంగి గ్రామంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. సీనియర్ నాయకుడు సర్పంచ్ నగరపు శ్రీరాములునాయుడు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ శుక్రవారం ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లాబాల వెంకటనాయుడు, బెవర మునలినాయుడు, నగరపు దుర్గారావు, మాజీ సర్పంచ్ నైగాపుల దుర్గారావు, వంద కుటుంబాల ప్రతినిధులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, కూటమి నాయకులు గర్భాన సత్తిబాబు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, కోట సంగంనా యుడు, ముంజేటి మురళి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు



ప్రచారంలో పాల్గొన్న చెత్తబండి డ్రైవర్, అంగన్‌వాడీ కార్యకర్త


పార్వతీపురంటౌన్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని వైసీపీ ప్రచారంలో 30వ వార్డుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, మున్సిపల్ చెత్తబండి డ్రైవర్ త్రినాథ్ పాల్గొన్నారంటూ ఫిర్యాదులు వచ్చాయని ఆయన చెప్పారు. కోడ్ ఉల్లంఘించి వీరిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా..

ఆర్వో కార్యాలయాన్ని పరిశీలించిన వ్యయ పరిశీలకుడు

సాలూరు: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం సాలూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని సిబ్బందితో మాట్లాడారు. ఎన్ని పార్టీలు నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నాయని, ఎంతమంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజలందుకుంటున్న గంగమ్మతల్లి

మక్కువ: సిబిల్లి పెద్దవలస గ్రామంలో గంగమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండితులు మార్కండేయశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో అన్న సమారాధన నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనివేళలు పాటించాలి

మక్కువ: ఉపాధి వేతనదారులు పనివేళలు పాటించాలని ఉపాధి ఏపీవో ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి, సన్యాసరాజపురం పంచాయతీల్లో ఉపాధి పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మస్తర్లను పరిశీలించారు.



మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీవో

అగ్ని ప్రమాదాలపై నివారణపై అవగాహన అవసరం

- కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

పాలకొండ: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిఉండాలని అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కోటదుర్గ ఆసుపత్రిలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పు డు ఉపయోగించాల్సిన పరికరాల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమం లో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

- **పార్వతీపురంటౌన్:** అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పైడిరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం జరిగితే వెంటనే 101కు సమాచారం ఇవ్వాలని కోరారు.

- **సీతంపేట:** ఏరియా ఆసుపత్రిలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అగ్నిమాపక అధికారి జామ సర్వేశ్వర రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాలకొండ: ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం



సీతంపేట: అగ్ని ప్రమాదాల జాగ్రత్తలపై వివరిస్తున్న అధికారి



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు